www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025

5



కోనసీమ


21న విద్యార్థులకు 'గ్రీవెన్స్ సెల్'

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలో వివిధ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 21 న గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు దిశా నిర్దేశం, సమస్యల పరిష్కారానికి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేశామన్నారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా 'విద్యార్థుల మెగా గ్రీవెన్స్' కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా,పీజీ ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఈ స్టూడెంట్స్ మెగా గ్రీవెన్స్ ఒక దారి చూపనుందని మంత్రి సుభాష్ అన్నారు.

చలికి గజగజ

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- భయపెడుతున్న శీతల గాలులు
- తెల్లవారుజామున కమ్మేస్తున్న పొగ మంచు
- రానున్న రోజుల్లో పెరగనున్న చలి తీవ్రత



రాజోలు మండలం శివకోడు జాతీయ రహదారి 216 పై ఉదయం 8 గంటలకు పొగమంచు

ప్రజాశక్తి - రాజోలు

కొన్నాళ్లుగా వాతావరణంలో ఏర్పడుతున్న అలజడితో విపరీతమైన మార్పులు వస్తున్నా యి. తద్వారా వానకాలంలో అతి భారీ వర్షాలు, ఎండాకాలంలో బండలు పగిలేలా ఉష్ణోగ్రతలు, చలి కాలంలో గజగజ వణికిపోయే విధంగా అత్యల్ప ఉష్ణోగ్రతలతో ప్రజలు అవస్థ పడుతున్నారు. గతేడాది మాదిరిగానే ఈ సారి శీతాకాలం కాసింత ఆల స్యంగా మొదలైనా అత్యల్ప ఉష్ణోగ్రతలు ప్రజలను వణికిస్తున్నాయి.

19 డిగ్రీల కనిష్టఉష్ణోగ్రతలు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో శీతల గాలుల తీవ్రతతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ఫలితంగా చలి విజృంభించి అందరినీ అల్లాడిస్తోంది. తెల్లవారుజాము నుంచే దట్టమైన చలి గాలులతో పాటు ఆకాశం నేలను తాకినట్లుగా కురుస్తున్న పొగ మంచుతో పరిస్థితి ఒక్కసారిగా భిన్నంగా మారింది. ఉదయం బయటికి వెళ్లేందుకు చిన్నాచితకా అంతా భయాందోళనకు గురవ్వాల్సి వస్తున్నది. చేసేది లేక ఉన్ని దుస్తులు ధరించి బయట అడుగుపెట్టాల్సిన అవసరం ఏర్పడింది. చలి తీవ్రత నాలుగైదు రోజులుగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ కొనసాగుతున్నది. డిసెంబర్ 1న గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. డిశంబర్ 15న కనిష్ఠ ఉష్ణోగ్రత 18కు చేరింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 29 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అవుతున్నది .మధ్యలో వర్షాలు కురిసిన సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పు చోటుచేసుకున్న సందర్భాలు నవంబర్ లో ఏర్పడింది.

మొదలైన పొగ మంచు

తెల్లవారుజాము నుంచే మంచు కమ్మేస్తున్నది. తెల్లవారు జామున రోడ్లపై ప్రయాణం కత్తి మీది సాములా మారింది. ఊర్లల్లో మాత్రం తగ్గుముఖం పట్టినా ఉష్ణోగ్రతల మూలంగా చలి గాలుల తీవ్రత పెరుగుతున్నది. ఉదయం 10 గంటల వరకూ తీవ్రమైన చలిగాలులు వీస్తుండడంతో చలికి గజగజ వణికిపోవాల్సి వస్తున్నది. రాత్రి వేళల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం అవుతున్నది. సాయంత్రం 5 గంటలు దాటితే చాలు చలి వణికిస్తోంది. గ్రామాల్లోని జలాశయాల్లో నెలకొన్న జలకళతోనూ ఆయా ప్రాంతాల్లో చలి అందరినీ భయపెడుతున్నది. పొగ మంచు ఓ వైపు ప్రజలకు ఆహ్లాదాన్ని సైతం పంచుతున్నది.

జాగ్రత్తలు తప్పనిసరి

ఉభయ జిల్లాల్లో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడంతో ఉదయం వేళల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదయం రహదారులను మంచు తెరలు కమ్మేస్తున్నాయి. చలిగాలుల తీవ్రత పెరుగుతున్నందున జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. ముఖ్యంగా వద్ధులు, చిన్న పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. చలి గాలులు ఎక్కువగా ఉండే సమయాల్లో ప్రయాణం చేసేటప్పుడు చెవులను నిండుగా కప్పుకునేలా ఏర్పా ట్లు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చలిని తట్టుకునే విధంగా స్వెటర్లు, చేతులకు గ్లౌజులు ధరిస్తే ఉత్తమమని వారు సూచిస్తున్నారు. జనవరిలో చలి తీవ్రత మరింత పెరగనున్నదని వాతావరణ శాఖ అంచనాలు చెబుతున్నాయి.

పల్లెలను కమ్ముతున్న మంచు దుప్పటి

రామచంద్రపురం: గత రెండు రోజులుగా పొగ మంచు అధికమైంది. తీవ్రమైన పొగ మంచుతో పల్లెలన్నీ మంచు దుప్పటి కప్పుకున్న చందంగా తయారయ్యాయి. ఇక సాయంత్రం నుంచి వేస్తున్న చలిగాలులకు పల్లెల్లోని వద్ధులు ,పిల్లలు గజగజ లాడుతున్నారు. ఇక ఉదయం పొగ మంచు 10 గంటల వరకు వదలకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తపడం లేదు. పొగ మంచుతో మెయిన్ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మంచు వల్ల రోడ్లు సరిగా కనిపించకపోవడంతో ప్రయాణికులు లైట్లు వేసుకుని ప్రయాణాలు కొనసాగించారు. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గడంతో పల్లె వాసులు చలిమంటలు వేసుకోవలన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం దాల్వా పంటచేలకు సాగునీరు మళ్లించడంతో వాతావరణ మరింత చల్లబడింది. చలి తీవ్రత పెరగడంతో మార్కెట్లలో స్వెటర్ లకు, ఉన్ని దుప్పట్లకు గిరాకీ పెరిగింది. డిసెంబర్ రెండో వారంలో ఎంత చలిగా ఉంటే ఇక ముందు ముందు ఎలా ఉంటుందోనని పల్లెవాసులు ఆందోళన చెందుతున్నారు.

20న ఉపాధి చట్టం పేరు మార్పుపై నిరసన

జయప్రదం చేయాలని వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో డిసెంబర్ 20న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు తలపెట్టారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని ఆందోళనను జయప్రదం చేయాలని వ్యవసా య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. ఈ నిరసనలో గ్రామీణ పేదలతో పాటు రైతులు, కౌలు రైతులు, రైతాంగానికి మద్దతిచ్చే ప్రజలు పౌర సమాజం పెద్దఎత్తున పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వ విధానాన్ని వెనక్కు నెట్టాలని విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టం-2005 రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తూ ఆర్థిక స్వావలంబనకు మార్గం కల్పిస్తూ, గ్రామీణ, ఆర్థిక, సామాజిక చిత్రాన్ని మార్చడానికి దోహదపడింద న్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు-2025ను ఖండిస్తున్నాయన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.బలరాం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామ చంద్రరావు, ఉపాధ్యక్షులు బుంగ సత్య నారా యణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తాడి శ్రీరా మ్మూర్తి, ప్రజాసంఘాల నాయకులు కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.దైవకృప, బి.ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - అమలాపురం

ఖరీఫ్ 2025-26 సీజన్లో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా డిసెంబర్ 17వ తేదీ వరకు జిల్లాలో 2, 80 683 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని జెసి టి.నిశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికే యుల సమావేశం నిర్వ హించి జిల్లాలో అత్యంత పారదర్శకంగా జవాబు దారీతనంతో ధాన్యం సేకరిస్తూ రైతులకు కనీస గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు న్నర లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించిందని ఇప్పటికే 2,80,683మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్త యినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు రూ.6503 కోట్లు 55,486 మంది రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ధాన్యం సొమ్ములు చెల్లించామన్నారు. ధాన్యాన్ని రైతులు విక్రయిం చడంలో ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నమైన జిల్లా కార్యా లయము నందు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబ ర్ 83094 32487, మరియు 94416 92275 సంప్రదించాలని అన్నారు. కార్యక్ర మంలో జిల్లా పౌరసరఫరా ల అధికారి అడపా ఉదయ భాస్కర్, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల విభాగం పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి- అల్లవరం

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపుపై అవగాహనా కార్యక్రమం అల్లవరం సబ్ స్టేషన్ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిఇ జి.అన్నవరం, జెఇ గణేష్ పాల్గొన్నారు. గ్రామాలలో ఇంధన పొదుపు తీసు కోవలసిన చర్యలను సూచించారు. గ్రామాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోవోల్టేజ్, కరెంట్ పోల్స్ పాడయిపోవటం, కరెంటు తీగలు వేలాడటం వంటి సమస్యలను దృష్టికి పలువురు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లా డుతూ దఫదఫాలు సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బొమ్ము బాలవేణి, కడలి గంగాచలం, సుందరనీడి సాయికృష్ణ, ఎంపిటిసి సభ్యులు పెచ్చెట్టి వెంకటేశ్వరావు, నిచేనకోళ్ళ మౌనిక, తోట నరసింహం, చిట్నీడి శ్రీనివాస్, పులుసుగంటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని ఊడిమూడి, కుందూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి విత్తనం మొలక శాతం చూసుకోవాలన్నారు. విత్తనం శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. దమ్ములోనే డిఎపి వేసుకోవడం భాస్వరం మొక్క పీల్చుకుంటుందన్నారు. రైతులకు యూరియా సీజన్ మొత్తం సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుందూరు సొసైటీ ఛైర్మన్ జెవి.రమణ, విఎఎ రేవతి, సుబ్బారావు రైతులు పాల్గొన్నారు.



దమ్ముచేలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎఒ

సర్పంచ్ భగవాన్‌దాస్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - అల్లవరం

డి.రావులపాలెం గ్రామ సర్పంచ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఉండ్రు భగవాన్ దాస్‌మ తదేహం వద్ద పలువురు నాయకులు బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇటీవల భగవాన్ దాస్ ప్రమాదానికి గురై అనారోగ్య తో మంగళవారం మ తి చెందారు. పలువురు మాట్లాడుతూ భగవాన్ దాస్ అకాల మతి కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కంకిపాటి వీరబాబు, గోడితిప్ప సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి శ్రీనివాస్, గోడి సర్పంచ్ తోట నరసింహారావు , శ్రీదేవి, ఎంపిటిసి సభ్యుడు తిక్క శేషు బాబు, నాయకులు పాల్గొన్నారు.

22న పివి.రావు వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి.రావు వర్ధంతి సభను జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 22 న అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. బుధవారం ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో బుధవారం పివి.రావు వర్ధంతి సభ ఆహ్వాన పత్రికలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు జల్లి శ్రీనివాసరావు, మండలం అధ్యక్షులు కొంకి వెంకట బాబ్జి, రాష్ట్ర మాలమహానాడు నాయకులు పెయ్యల పరశురాముడు, నాతి శ్రీనివాసరావు, మాల మహానాడు మండల జెఎసి నాయకులు కుంచే బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

కొమరిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో సొసైటీ సమీపంలో బుధవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వికలాం గుల జిల్లా అధ్యక్షులు జంపన రామభద్రరాజు అధ్యక్షతన జరిగింది.సొసైటీ ఛైర్మన్ పెన్మెత్స వెంకటరాజు సహకారంతో దుప్పట్లను సమకూ ర్చారు. ప్రభుత్వ విప్ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వికలాం గులు స్వావలంబనతో జీవించేందుకు అవసరమైన సదుపాయాలు, అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, సాగిరాజు సూరిబాబు రాజు, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, సాగి వాసురాజువరసాల చాముండేశ్వరి, సూర్య నారాయణ, కలిదిండి కృష్ణంరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

ఫిజియోథెరపి సెంటర్ వార్షికోత్సవం

ఆత్రేయపురం: ఫిజియోథెరపీ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సెంటర్ వైద్యులు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీతలు బుధవారం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించారు. చిన్నారులకు విద్యాసామగ్రిని చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లొల్ల పాఠశాల హెచ్ఎం బిఎన్.వాసుకి తదితరులు పాల్గొన్నారు.

చదువును అశ్రద్ధ చేయొద్దు

ప్రజాశక్తి - అల్లవరం

చదువే మీ జీవితాల్లో వెలుగులు నిపుతుందని, చదువుపట్ల అశ్రద్ధ చేయవద్దని విద్యార్థులకు సైబర్ క్రైమ్ సిఐ ప్రశాంత్ కుమార్ సూచించారు. బుధవారం గోడి గురుకుల పాఠశా లలో ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ మీ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ప్రిన్సిపల్ ద్వారా సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి- అల్లవరం

మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంతో కృషి చేయాలని ఎంపిపి యిళ్ల శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాల యంలో ఆయన అధ్యక్షతన మండల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో ఈ నెల16న అనారోగ్యంతో మృతి చెందిన డి .రావుల పాలెం సర్పంచ్ ఉండ్రు భగవాన్ దాస్‌కు సభ్యులు నివా ళులు అర్పించారు. అనంతరం సభ ప్రారంభిం చారు. సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమా లను మండల సమావేశంలో ప్రవేశపెట్టారు. అల్లవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి అయినవిల్లి మండలం డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్న తిపై వెళ్లిన ఎస్.రాజమోహన్‌ను ఎంపిపి తదితరులు సత్కరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నరసిం హారావు, వివిధ శాఖల అధికారులు, జెడ్పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి ,వైస్ ఎంపీపీలు ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి, పరిపాలన అధికారి శర్మ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి యిళ్ల శేషగిరిరావు

సబ్‌జైల్‌లో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి తనిఖీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని సబ్‌జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎన్.శ్రీలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలు తాగునీరు గురించి తెలుసుకున్నారు వంటసాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేసి వారి కేసులు వివరాలు తెలుసుకున్నారు. బెయిల్‌కు న్యాయవాదుని పెట్టుకోలేని పేదవారికి న్యాయస్థానం ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, న్యాయవాది పివిఎస్.జానకి, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి , వీరేశ్వర స్వామి వార్ల హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. అంతర్వేది నరసింహస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.ప్రసాద్, దేవాదాయ శాఖ తనిఖీదారు టి.శ్రీనివాస్ పర్యవేక్షణలో హుండీల ఆదా యాన్ని ఆలయ ముఖమండపంలో లెక్కిం చారు. 28 రోజులకు రూ.1కోటి 56 లక్షల 31 వేలతో పాటు 27 గ్రాముల బంగారం, 1.150 కేజీల వెండి, 10 దేశాల 43 విదేశీ కరెన్సీనోట్లు వచ్చాయని ఆలయ డిసి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఇఒలు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్ సివిల్ జడ్డి వెంకటేశ్వరరావు ఆదేశాలతో రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాల అనర్థాలపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహిం చారు. కార్యక్రమంలో సిడిపిఒ వి.లక్ష్మి పాల్గొని బాల్యవివాహాలతో వచ్చే అనర్థాలను వివరించారు. న్యాయవాదులు దోమలపాటి సత్యనారాయణ, బండి శ్రీనివాసు బాల్య వివాహ నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.నాగమణి, అంగన్‌వాడీసిబ్బంది భారతి, దుర్గా భవాని, మంగరత్నం, పిఎల్‌వి.సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం.** బాల్యవివాహాల వలన కలిగే నష్టాలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం గొల్లవిల్లి సిఎస్ఎం జూనియర్ కళాశాల, జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.కనకదుర్గ, కాలేజీ ప్రిన్సిపల్ కె.బాలాజీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.కుమారి, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అన్నాయిపేట

- గ్రామాభివృద్ధికి సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు కృషి
- ఐదేళ్ల గౌరవ వేతనం కమ్యూనిటీ భవనానికి వెచ్చించిన సర్పంచ్

ప్రజాశక్తి - రామచంద్రపురం

అన్నాయిపేట గ్రామాన్ని ఆ గ్రామ సర్పంచ్ పెమిరెడ్డి నాగేశ్వరరావు (దొరబాబు) అభివృద్ధి పథంలో నడిపించారు. గ్రామ సర్పంచ్‌గా గెలుపొందినప్పటి నుంచి నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఐదేళ్ల పాటూ తనకు లభించిన గౌరవ వేతనాన్ని మొత్తం కాపు కమ్యూనిటీ భవనానికి వెచ్చించిన ఘనత ఆయనది. 2019 నుంచి పాలకవర్గ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేశారు. గ్రామంలో ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న శ్మశానాన్ని అభివృద్ధి చేసి ఆక్రమణలతో ఉన్న వాటిని తొలగించారు. అనంతరం ప్రహరీ నిర్మించి సుందరగా తీర్చిదిద్దారు. తన తల్లిదండ్రులు పెమ్మిరెడ్డి శేషగిరిరావు దంపతులు, సోదరులు పెమ్మిరెడ్డి రామకృష్ణారావు, మాజీ సర్పంచ్ పెమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు జ్ఞాపక చిహ్నంగా రూ.1.60 లక్షలతో రెండు విశ్రాంతి షెడ్లు నిర్మించారు. ఐదేళ్లలో తనకు లభించిన గౌరవ వేతనం సుమారు రూ. రెండు లక్షలతో అన్నాయిపేటలో నిర్మించిన కాపు కమ్యూనిటీ హాలుకు రూ.1 లక్ష, అలాగే బొందెలగూడెంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలుకు రూ.1లక్ష విరాళంగా అందజేశారు. కాపు కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభోత్సవం తాను ప్రకటించిన విరాళంతో స్ఫూర్తిగా తీసుకుని గ్రామస్తులు సుమారు రూ.8 లక్షల విరాళాలు ప్రకటించడం విశేషం. దీంతో పాటుగా గ్రామ ప్రజలకు రక్షిత మంచినీరు అందించేందుకు కాకినాడ రోటరీ క్లబ్ సహకారంతో సుమారు రూ.10 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. వీటితో పాటుగా గత 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రంగనాయకమ్మ పేట మురుకి కాలువపై కల్వర్టు నిర్మించడం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధుల తో గ్రామంలో ఏడు సిమెంట్ రోడ్డు నిర్మించారు.




రూ.55 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనం ఇదే



సర్పంచ్ పెమిరెడ్డి నాగేశ్వరరావు నిధులతో నిర్మించిన విశ్రాంతి షెడ్డు ఇదే

ఐదేళ్ల పాటూ గ్రామాభివృద్ధి కోసం పనిచేశా



గ్రామాభివృద్ధికి తనకు లభించిన అవ కాశంగా నిరంతరం అభివృద్ధికి ఈ ఐదేళ్లు పని చేశాను. తన గౌరవ వేతనాన్ని అభివృద్ధికి ఖర్చుచే శాను. అదేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలలో గ్రామ స్తులంతా సహాయ సహకారాలు అందజేశారు. దీనికి ఉప సర్పంచ్ చల్లా బుజ్జి పాలకవర్గ సభ్యులందరూ తమ వంతు కృషి చేశారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలి యజేశారు. రాజకీయాలలో ఉన్న లేకున్నా గ్రామాభి వృద్ధికి తన వంతు కషి చేస్తానని ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'కి తెలియజేశారు.

– పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు (దొరబాబు), అన్నాయిపేట సర్పంచ్



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మండల టిడిపి నేతలు

రహదారుల అభివృద్ధి వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కృషితో మండలంలో ప్రధాన ఆర్అండ్‌బి రహదారుల అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని మండల టిడిపి అధ్యక్షులు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, మాజీ ఆలయ ఛైర్మన్ వైట్ల శేషుబాబు, ఈదల రాంబాబు తదితరులు పేర్కొన్నారు. బుధవారం వారు కొత్తూరు సెంటర్లో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు.

మందేశ్వర స్వామి క్యాలెండర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి - కొత్తపేట

ప్రముఖ దివ్య క్షేత్రం మందపల్లి శ్రీ మందేశ్వర (శనీశ్వర)స్వామి దేవస్థానం ప్రచురించిన- 2026 క్యాలెండర్ ను బుధవారం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాలకమండలి సభ్యులతో కలిసి వాడపాలెం ఎంఎల్ఎ కార్యాలయంలో ఆవిష్కరిం చారు. ఆలయ అనువంశిక ధర్మకర్త గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును ఆలయానికి ఆహ్వానించి, ఆయనను గౌరవించుకునేందుకు తగిన ఆలోచన చేసి ముందుకు వెళదామని గ్రామస్తులతో ఈ సందర్భంగా ఎంఎల్ఎ అన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆలయ అధికారులకు, గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఇఒ ద్వారపురెడ్డి సురేష్ బాబు, చింతంకృష్ణ, ధరణాల రామకృష్ణ, సిద్ధంశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

ఐదుగురికి రూ.50 వేల జరిమానా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని కాకినాడ ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జి ఎదుట పోలీసులు హాజరుపర్చారు. వారిలో ఐదుగురికి రూ.10 వేలు చొప్పున రూ.50 వేలు జరిమానా విధించగా, మరో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్షను విధించారని ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ముందస్తుగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ నేతలపై కేసుల నమోదు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి బస్టాండ్ సమీపంలో బుధవారం నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, గడ్డి బొమ్మను తగుల బెట్టి ఇబ్బందులు సృష్టించడంతో కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాకర్ల హరిబాబు, వెలగా రామకృష్ణ, మట్టపర్తి రామ్మోహన్, గన్నిన రామా నాయుడు, సుంకర సత్యనారాయణ, జ్యేష్ట సతీష్, మార్టిల్ లూథర్ తదితరులుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యనమదల యేసు అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధితుడు యేసు పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది పొడవునా పశువుల మేత కోసం ఎంతో శ్రమించి సిద్ధం చేసుకున్న గడ్డి కట్టలు కాలిపోవడంతో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు. దీనిపై సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

నేడు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధ్యాయుల సమస్యలపై నేడు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుటఉన్న ధర్నా చౌక్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జివి.రమణ, ఎమ్‌టివి.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ప్రకటన చేసిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కుడుపూడి శ్రీనివాసరావు, పినిపే మురుగేశ్వరరావు ఉన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు, 10వ తరగతి 100 రోజుల ప్రణాళిక నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారము నిమిత్తం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తారన్నారు.

బాల కార్మికుల గుర్తింపు కేసు నమోదు

ప్రజాశక్తి - రావుల పాలెం

రావులపాలెంలో బాలకార్మికులను గుర్తించి కేసులు నమోదుచేశారు. బుధవారం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మనోజ్, విద్యాశాఖ, పోలీసు యంత్రాంగం, అలెర్ట్ ఎన్‌జిఒ జిల్లా కో ఆర్డినేటర్ శీల శ్రీను బృందం పర్యటించి ముగ్గురు బాల కార్మికులను గుర్తించారు. ఈ సందర్భంగా దుకాణాలు, సంస్థలను పరిశీలించారు. బాల కార్మికులు పద్దెమినిమిది ఏళ్ల వయసు లోపు కల వారిని షాపు యజమానుఉల పనిచేసేందుకు ఉపయోగించరాదని అన్నారు. వివిధ రంగాల యజమానులకు చట్టం గురించి వివరించారు

జీవన ప్రమాణాలు మెరుగు పర్చుకోవాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు వినియోగించుకుని జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని డిపిఎం కె.శ్రీనివాస్ తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయములో బుధ వారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల సాగు ఖర్చు తగ్గడమే కాకుండా, నేల సారవంతమవుతుందన్నారు. సమావేశంలో అడిషనల్ డిపిఎం. సత్య నారాయణ, మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ, ఎపిఎం వెంకట రమణ, జిపిఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

డివిజన్ లెవెల్ ఉపాధ్యాయుల ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. త్రోబాల్ విజేత గా రామచంద్రపురం మహిళ జట్టు, రన్నర్‌గా కపిలేశ్వరపురం మహిళ జట్టు నిలవగా, పురుషుల క్రికెట్ పోటీలో కపిలేశ్వరపురం జట్టు విజేతగా, రామచంద్రపురం జట్టు రన్నర్ గా నిలిచాయి. రామచంద్రపురం గవర్నమెంట్ హైస్కూల్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఉప విద్యాశాఖధికారి ప్రత్తి రామలక్ష్మణమూర్తి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఏపీసీ జి. మమ్మీ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

టిడిపి జిల్లా అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి - అయినవిల్లి

జిల్లా టిడిపి నూతన అధ్యక్షుడిగా ఎంపికైన గుత్తుల సాయిని అయినవిల్లి మండల సీనియర్ నాయకులు బుధవారం ఆయన ఇంటివద్ద సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్, సీనియర్ నాయకుడు సరెళ్ళ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుమ్మళ్ళ సాగర్, ఎఎంసి డైరెక్టర్ మోర్త సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళా సాధికారితతో పాటు లింగ సమానత్వం సాధించేందుకు జెండర్ రిసోర్స్ సెంటర్ దోహదం చేస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్ ను బుధవారం ఆయన ప్రారంబించారు. కార్యక్రమంలో కోలా బాబ్జి,చెల్లి అశోక్ లతో పాటు పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో సీనియర్ పింఛనర్లకు సత్కారం

పెన్షన్ ఉద్యోగుల హక్కు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఉద్యోగ విరమణ పొందిన ప్రతీ ఉద్యోగి పెన్షన్ పొందడం హక్కు అని ముమ్మిడివరం పెన్షనర్ల అసోసియేషన్ పేర్కొంది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పెన్షనర్స్ కార్యాలయం నందు బుధవారం జనిపల్లి సత్యనారాయణ అధ్యక్షతన పెన్షనర్ల డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప ఖజానా అధికారి భీమేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పెన్షనర్ల హక్కుల కోసం పోరాడిన 'డి ఎస్ నకారా' చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. అనంతరం నలుగురు సీనియర్ పెన్షనర్లు సిహెచ్ బిఆర్‌కె.ఆచార్యులు, బుడితి నాగేశ్వరరావు, కొప్పిశెట్టి రామ్మూర్తి, కొప్పిశెట్టి వెంకట్రావులను దుశాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైవి. రమణమూర్తి, విత్తనాల వర ప్రసాదరావు, ఎన్.అబ్బులు, పి.కామేశ్వరి, గొల్లకోటి ఆదినారాయణ, బీర కృష్ణమూర్తి, పితాని లక్ష్మణేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, జనిపల్లి కృష్ణమూర్తి, పలువురు పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో పలువురికి సన్మానం

పెన్షనర్ల సేవలు స్ఫూర్తి దాయకం

కొత్తపేట: పింఛనర్ల సేవలు యువ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ అన్నారు. కొత్తపేట పూర్వ తాలూకా శాఖ పెన్షనర్ల దినోత్సవం బుధవారం అధ్యక్షులు కాశి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆర్‌డిఒ పి.శ్రీకర్, ఎస్‌టిఒ జి.సుజాత, ఎంపిడిఒ పి.నరేష్ కుమార్. తహశీల్దార్ వై.రాంబాబు, వై.సురేష్, మోటూరి రామారావు హాజరయ్యారు. సీనియర్ సభ్యులు 18 మందిని ఈ సందర్భంగా సత్కరించారు.



దాతలకు చిత్రపటం అందజేస్తున్న ఇఒ అల్లు వెంకట దుర్గా భవాని

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి యానాంకు చెందిన వాకా అనీష్‌చంద్రరెడ్డి, జెస్సి మౌనిక దంపతులు కుమారుడు వాకా వెంకట అక్షత్ రెడ్డి పేరు మీద రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయ సహాయ కమిషనర్, ఇఒ అల్లు వెంకట దుర్గాభవానీకి ఈ మొత్తం అందజేశారు. దాతలకు సహాయ కమిషనర్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న సిఎంఒ సుబ్రహ్మణ్యం

వైజ్ఞానిక ప్రదర్శనలతో జ్ఞానం పెంపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మేథాశక్తి పెరుగుతుందని సిఎంఒ బొరుసు వీర వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలకు ఒక ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను సిఎంఒ సుబ్రహ్మణ్యం మండల విద్యాశాఖ అధికారులు నూకల వీరాస్వామి, సత్తి సత్యకృష్ణ తిలకించారు. ప్రదర్శనలో 8 అంశాలను ప్రదర్శించగా ఒక్కో ప్రాజెక్టు నుండి ఒక్కో అంశం జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. కార్యక్రమంలో హెచ్ఎం జి.కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** పెదపట్నంలంక హైస్కూల్లో బుధవారం హెచ్ఎం పి.శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, ఎం వెంకన్న బాబులు ఈ ప్రదర్శనను సందర్శించారు, మండల పరిధిలో 13 హైస్కూల్ నుంచి 7 దీమ్స్ కు సంబంధించిన 68 ప్రాజెక్టులను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు ఈ పోటీలలో విజేతలు ఈనెల 22న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో 13 హైస్కూల్ కి చెందిన ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సెల్ ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

5జి ఫోన్లతో సేవలు వేగవంతం

అంగన్‌వాడీ వర్కర్లకు 5జి మొబైల్స్ పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవల్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్లను అందిస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలో ధర్మగుండం చెరువువద్ద ఉన్న శ్రీ సీతారామ కమ్యూనిటీ హాల్ వద్ద మండపేట ఐసిడిఎస్ ప్రోజెక్ట్ సిడిపిఒ అధికారి యు.పూర్ణిమ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్లకు 5జి స్మార్ట్ మొబైల్స్ పంపిణీ కార్యాక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. 253 మంది అంగన్వాడీ వర్కర్లకు, సూపర్‌వైజర్లకు ఈ 5జి ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు మత్సా నాగు, మండల అధ్యక్షులు కర్రి తాతరావు, కుంచె ప్రసాద్ తదితరులు, పాల్గొన్నారు.

డిఎస్‌పి రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్థానిక పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్ బుధవారం స్టేషన్ లోని రికార్డులను తనిఖీ చేశారు. సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎస్,రాము పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.



అమలాపురం డిఎస్‌పితో మాట్లాడుతున్న మృతుని కుటుంబ సభ్యులు

'శ్రీను' హత్య కేసు దర్యాప్తు అధికారిగా డిఎస్‌పి

ప్రజాశక్తి - అమలాపురం

కంచిపల్లి శ్రీను హత్య కేసును దర్యాప్తు అధికారిగా డిఎస్‌పి టిఎస్ఆర్‌కె. ప్రసాద్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు.కంచిపల్లి శ్రీను హత్య కేసులో న్యాయం కోసం బాధితులు చేస్తున్న పోరాటం కీలక మలుపు తిరిగింది. అమలాపురం పట్టణ సిఐ వీరబాబు నిందితులకు సహకరిస్తున్నారంటూ మృతుని కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు వేగంగా స్పందించారు. ఈ మేరకు బుధవారం అమలాపురం డిఎస్‌పి బాధితులను తన కార్యాలయానికి పిలిపించి సుమారు గంటసేపు సుదీరంగా చర్చించారు. బాధితులతో మాట్లాడిన డిఎస్‌పి కేసులో ఇప్పటి వరకు జరిగిన కేసు వివరాలు చర్చించారు. కేసునకు సంబంధించి కుటుంబ సభ్యులు కు ఉన్న అనుమానాలు అడిగి తెలుసుకున్నారు. సిఐపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో, ఈ కేసు దర్యాప్తును ఇకపై నేనే స్వయంగా పర్యవేక్షిస్తాను. విచారణలో ఎలాంటి పక్షపాతం ఉండదు" అని బాధితులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. కేసులో ఏ చిన్న సమాచారం ఉన్నా లేదా పోలీసుల వైపు నుంచి ఏదైనా ఇబ్బంది ఎదురైనా నేరుగా తనకే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ చర్చల సందర్భంగా కంచిపల్లి శ్రీను కుటుంబ సభ్యులు, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ కలిశారు. ప్రధాన నిందితుడు కాసుబాబుకు రాజకీయ అండదండలు ఉన్నాయని, సిఐ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే ముగ్గురు నిందితులకు బెయిల్ వచ్చిందని వారు డిఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన నిందితుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ త్వరగా బెయిల్ రాకుండా చూడాలి అని, నిందితుడి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు కోరారు.దీనికి డీఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ, కోర్టు లో కేసు విచారణ త్వరితగతిన వచ్చేట్టు చూస్తాం అని బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



'స్పెల్ బి' విజేతలతో ఎంఇఒలు

'స్పెల్ బి' విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

'స్పెల్ బీ' పోటీలను ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశించింది. బుధవారం మండల స్థాయిలో 'స్పెల్ బీ' పోటీలు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు జరిగాయి. ఈ పోటీలో విజేతలుగా నర్సిపూడి హైస్కూల్ నుంచి కె.జై శివరామకృష్ణ, బొబ్బా జయశ్రీ గర్ల్స్ హైస్కూల్ నుంచి ఎ.తేజ సాయి త్రిషిత, చెముడులంక హైస్కూల్ నుంచి పి.ముకుందన్, డివివిఎస్ఎం.సాయితేజ, ఎం.వినయ్, కె.కృప, బొబ్బా జయశ్రీ గర్ల్స్ హైస్కూల్ నుంచి ఎస్.తపస్విని విజేతలుగా నిలిచారు. వీరంతా జిల్లా స్థాయిలో నిర్వహించే 'స్పెల్ బీ' పోటీలకు హాజరవుతారన్నారు. దీంతో విజేతలకు ప్రశంసా పత్రాన్ని, బహుమతులను అందజేసి ఎంఇఒలు బి.అప్పాజీ, ఎన్.రాజు అభినందించారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్లుగా ఎండి.అసదుల్లా ఖాన్, ఎస్.పద్మజ వ్యవహరించారు.

కమిటీలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో వికలాంగ కమిటీలను ఏర్పాటు చేయాలని యువస్పందన స్వచ్ఛంద వికలాంగ సంఘం నాయకుడు బివివి.సత్యనారాయణ కోరారు. బుధవారం మండలంలోని చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామ, మండల స్థాయి వికలాంగుల కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు, 2016 జిఒను అమలు చేసేందుకు వికలాంగులను భాగస్వాములు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉలవలశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన వైద్యసదుపాయల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మండలంలోని గోదాశి వారిపాలెం, గేదెల్లంక, అనాతవరం గ్రామాలలో రూ.1కోటి ఎనిమిది లక్షల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ పనులకు బుధవారం ఎంఎల్ఎ సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. అలాగే నగర పంచాయతీ పరిధిలో రూ.1కోటి 25 లక్షల వ్యయంతో 2, 3, 9, 10,15, 20వ వార్డులలో నిర్మించనున్న సిసి రోడ్లకు ఎంఎల్ఎ సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించెందుకు ప్రాధాన్యతా క్రమంలో సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు వెచ్చిస్తున్నామ్మన్నారు. అలాగే నిరంతరం విద్యుత్ సరఫరా అందించడమే ధ్యేయంగా విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా అనాతవరం లో ఏర్పాటు చేసిన 33కెవి 2 ట్రాన్స్‌ఫార్మర్లను ఎంఎల్ఎ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఓగురి భాగ్యశ్రీ, నగర పంచాయతీ కౌన్సిలర్ అడబాల సతీష్ కుమార్, చెల్లి అశోక్, కోలా బాబ్జి, అర్ధాని శ్రీనివాస రావు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణ కుమార్, సర్పంచ్ సానబోయిన పల్లయ్య(గేదెల్లంక), మిమ్మితి చిరంజీవి(అనాతవరం), పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయ ట్రస్ట్ ఛైర్మన్‌గా సూర్యనారాయణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కేశవ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా కంచర్ల సత్య సూర్యనారాయణ, ధర్మకర్తలు బుధ వారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరపంచాయతీ పరిధిలోని కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ట్రస్ట్ బోర్డు కార్యదర్శి సమక్షంలోఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరుపై ఖండన

ప్రజాశక్తి - రామచంద్రపురం

గ్రామ, వార్డు, సచివాలయాలలో బయోమెట్రిక్ ప్రవేశపెట్టి, ఆ హాజరు ఆధారంగానే జీతాలు ఇస్తామనడాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఖండిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గౌరవ అధ్యక్షులు మద్దాల బాపూజీ ఒక ప్రకటనలో తెలిపారు రెవెన్యూ శాఖలో పనిచేయాలా సచివాలయ శాఖ పరిధిలో పనిచేయాలో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. 94 రకాల రెవెన్యూ విధులతో పాటు ఇతర డిపార్ట్మెంట్ల పన్నులు చేస్తున్నామని, సచివాలయాల విధులు నిర్వహిస్తూ తీవ్ర పని ఒత్తిడి పై ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూలో హాజరు వేయాలా సచివాలయం యాప్‌లో వేయాలో నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వార్డు సచివాలయం ద్వారానే అయితే విఆర్‌ఒలకు రెవెన్యూ విధులు తొలగిస్తారా లేక సచివాలయం హాజరునుంచి మినహా ఇస్తారో తెల్చాలన్నారు. ఈనెల 19న విజయవాడలోజరిగే రాష్ట్ర కమిటీ సమావేశంలో చరిస్తామన్నారు.

సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాగల్లు

ఊనగట్ల సొసైటీ రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. చాగల్లు మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన దీన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, ఊనగట్ల సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, చాగల్లు గ్రామ అధ్యక్షులు దొంగ రామకృష్ణ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.17కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మెర్లపాలెంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.23.60లక్షలతో చేపట్టనున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం ఆత్రేయపురంలో ఎపిఎస్ఎస్ నిధులు రూ.53లక్షలతో నిర్మించనున్న మండల విద్యాశాఖ అధికారి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తరువాత వద్దిపర్రు గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన నిధులు రూ.20లక్షలతో తలపెట్టిన సిసి డ్రెయిన్ నిర్మాణానికి, బొబ్బర్లంకలో రూ.20.50 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, ముళ్ళపూడి భాస్కరరావు, కుసంపూడి రామకృష్ణంరాజు, పిఎస్.రాజు, సర్పంచ్‌లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుపై ఏకాగ్రత చూపాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

విద్యార్థులు చదువుపై ఏకాగ్రత చూపాలని అమలాపురం ఏరియా హాస్పిటల్ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సౌమ్య సూచించారు. మామిడికుదురు హైస్కూల్లో బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమయానికి నిద్ర పోవాలని, వ్యాయమం, యోగా, ధ్యానం, మనసుకు ప్రశాంతతను ఇస్తాయన్నారు మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో నగరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జాన్ లెవీ, సూపర్‌వైజర్ బళ్ళ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఈనెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియోను జయప్రదం చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ వీరన్న సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పంచాయతీ, సచివాలయ, వైద్య సిబ్బందికి ఒకరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **దేవరపల్లి :** దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పల్స్ పోలియోపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు మండల పరిషత్ అధ్యక్షులు కె.వి.కె. దుర్గారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్యులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఐదేళ్లలోపు 9,450 మంది పిల్లలను గుర్తించామన్నారు. మొత్తం 67 పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగార్జునరావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, వైద్యాధికారులు బి.మౌనిక, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని మల్లవరంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో గృహాలను కోల్పోయిన ఇమ్మన గంగరాజు, ఎం.పెదకాపు, వై.వీర్రాజు, వై.వెంకటరమణ, కె.నూకరత్నం కుటుంబాలను ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ బుధవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షల వరూ ఆస్తినష్టం జరిగిందని బాధితులు ఆయనకు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో సేనాపతి త్రిమూర్తులు, గోకాడ చిట్టిబాబు, కళ్యాణ్, పల్లెల కొండలు, అల్లం వెంకన్న, రమణ, వైసిపి జగ్గంపేట అధ్యక్షుడు రావుల గణేష్ రాజా పాల్గొన్నారు.